క్లుప్తంగా

కనిగిరిలో శాంతియుత నిరసన



కనిగిరిలో శాంతియుత నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

కనిగిరి రూరల్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను ఖండిస్తూ కనిగిరిలో దుర్గం బాప్టిస్ట్ చర్చి క్రైస్తవులు ఆదివారం శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుర్గం బాప్టిస్ట్ చర్చి చైర్మన్ గంటా విద్యాసాగర్ మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులను ఆపాలన్నారు. కొన్ని రాష్ట్రాల్లో క్రైస్తవులపై, దైవ సేవకులపై దాడులు చేయడం, హింసించడం, చర్చిలు తగులబెట్టడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మౌనం వీడి బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. మణిపూర్‌లోని క్రైస్తవులకు సంఘీభావం తెలుపుతూ, ధైర్యంగా ఉండాలని, వారి కొరకు ప్రార్థన చేశారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ తాతపుడి సర్వోన్నత కుమార్, ట్రెజరర్ వై డి.రత్నకుమార్, సంఘ కమిటీ నాయకులు జి.అశోక్, విజయభాస్కర్, కె. ప్రశాంత్, వై వెస్లీ, తేళ్ల రాజేంద్ర, తాతపూడి శ్యాముల్, విల్‌ఫ్రెడ్, యూత్ డైరెక్టర్ గోనా సదానందం, డాని బాబు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మార్కాపురం టౌన్: బేస్తవారపేట నుంచి నేషనల్ హైవేపై వాహనంలో అక్రమంగా తరలుతున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి మార్కాపురం మండలం కుంట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు రేషన్ గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

బేస్తవారిపేట: మండలంలోని ఎంపీ చెరువు సమీపంలోని పొలాల్లో పేకాట శిబిరంపై ఎస్సై మాధవరావు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 5400 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న, నాటుసారా తయారీ, అమ్మకాలు జరుపుతున్న వ్యక్తుల వివరాలు పోలీసులకు అందజేయాలని ఎస్సై కోరారు.

220 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో కంభం వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎంపీ సందీప్‌కుమార్, కె. కీర్తి, బీపీ రంగనాయకులు 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మేకల రాజేశ్వరి, కోనపల్లె మాజీ సర్పంచ్ నాదేళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ పూజలు, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి భక్తులు 12 చీరెలు బహూకరించారు. ఆలయానికి 16914 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ భాస్కరరెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాకంబరిగా పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించి ఆదివారం పూజలను నిర్వహించారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, దేవీ ఖడ్గమాల, సహస్ర నామార్చన పూజలను అర్చకులు దేవులపల్లి పవన్‌కుమార్ శర్మ చేశారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

ఇది కదా.. గ్రామ స్వరాజ్యం

కొండపి నియోజకవర్గంలో రూ.200 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు

- 89 గ్రామ సచివాలయాల నిర్మాణానికి రూ.35.6 కోట్లు
- 90 రైతు భరోసా కేంద్రాలకు రూ.19.62 కోట్లు
- 62 హెల్త్ క్లినిక్‌లకు రూ.13.65 కోట్లు
- 55 బీఎంసీయూలకు రూ.9.7 కోట్లు
- 36 డిజిటల్ లైబ్రరీలకు రూ.7.76 కోట్లు
- తారు రోడ్ల నిర్మాణానికి రూ.40 కోట్లు
- 7,947 జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.49 కోట్లు
- పాదిలి నుంచి మర్రిపూడి వరకు సాగర్ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.28.5 కోట్లు

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుగొమ్మలు.. అలాంటి పల్లెల అభివృద్ధిని తెలుగుదేశం జమానాలో గాలికొదిలేశారు. అభివృద్ధి పనుల పేరుతో కేటాయించిన నిధులను పచ్చచొక్కాలు ఏకమై పప్పుబెల్లాల్లా పంచుకున్న తీరును చూసి జనం విస్తుపోయారు. ఏ పని మొదలుపెట్టినా పచ్చ గద్దలు అక్కడ వాలిపోయి పర్సంటేజీలు తన్నుకుపోయాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ ఘోర ఓటమి చవిచూడటం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టడంతో గ్రామ స్వరాజ్యానికి పునాదులు పడ్డాయి. అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలతో పల్లె సీమల్లో ×నవశకం¥ మొదలైంది. గడిచిన నాలుగేళ్లలో ఒక్క కొండపి నియోజకవర్గంలోనే కేవలం అభివృద్ధి పనుల కోసం 200 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించడం విశేషం.



కొండపిలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించి ఇటీవల ప్రారంభించిన గ్రామ సచివాలయం

కొండపి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన దరిమిలా కొండపి నియోజకవర్గం అభివృద్ధిలో శరవేగంగా ముందుకు సాగుతోంది. నియోజకవర్గంలో 89 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా 76 సచివాలయ పనులు ప్రారంభించారు. వాటిలో 37 సచివాలయాల నిర్మాణం రూ.14.8 కోట్ల నిధులతో పూర్తి చేశారు. 90 రైతు భరోసా కేంద్రాలకుగాను 19.62 కోట్లు మంజూరు చేయగా రూ.9.16 కోట్లు వెచ్చించి 42 భవనాలు నిర్మించారు. మరో 32 భవనాల నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.5.1 కోట్లు ఖర్చు చేయగా వివిధ దశల్లో ఉన్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 62 మంజూరు కాగా రూ.2.5 కోట్ల ఖర్చుతో 16 భవనాలు పూర్తయ్యాయి. వివిధ దశల్లో ఉన్న 42 క్లినిక్‌లకు ఇప్పటి వరకు రూ.5.46 కోట్లు ఖర్చు చేశారు. అదే విధంగా ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.1.70 కోట్లతో కామేపల్లిలోని పీహెచ్‌సీకి అదనపు భవనం, కాకర్ల పీహెచ్‌సీకి రూ.1.69 కోట్లతో అదనపు భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లకు సంబంధిం రూ.1.95 కోట్లు ఖర్చు చేసి 11 భవనాలు నిర్మించారు. 12 డిజిటల్ లైబ్రరీలకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



నూతనంగా తారులేయర్ వేసిన పెట్లూరు-పాదిలి రహదారి

మౌలిక వసతులకు పెద్దపీట

- కొండపి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ నిధులు రూ.43.5 కోట్లు మంజూరు చేసింది. ప్రధానంగా ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ఊళ్లపాలెం-వేములపాడు(ఓవీ) రోడ్డును 25 కి.మీ మేర డబుల్ లేన్‌గా నిర్మించేందుకు రూ.35 కోట్లు కేటాయించడంతో పనులు చకచకా సాగుతున్నాయి.
- టంగుటూరు-కొండపి రోడ్డులో సాధువారిపాలెం నుంచి పెట్లూరు గ్రామం వరకు సుమారు 21 కి.మీ రోడ్డుపై రూ.3.5 కోట్లతో తారు లేయర్ వేశారు.
- కొండపి నుంచి జాళ్లపాలెం వరకు సుమారు 12.4 కి.మీ రోడ్డుపై రూ.1.5 కోట్లతో తారు లేయర్ వేశారు.
- వీకేకే రోడ్డులో వావిలేటిపాడు నుంచి చిరికూరపాడు వరకు 12 కి.మీ రోడ్డుపై రూ.3.5 కోట్లతో తారు లేయర్ వేశారు.
- చిరికూరపాడులో రూ.15 లక్షలతో 400 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మించారు.
- జగనన్న కాలనీల్లో 7,947 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2,121 భవనాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అందుకుగాను లబ్ధిదారులకు ప్రభుత్వం సుమారు రూ.48 కోట్లు విడుదల చేసింది.
- పాదిలి చిన్న చెరువు నుంచి గుండ్లసముద్రం మీదుగా మర్రిపూడి వరకు 11 కిలోమీటర్ల మేర సాగర్ పైప్‌లైన్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 28.5 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. 9 గ్రామాలకు చెందిన 36 వేల మంది ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చే ఈ పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు సర్వే కూడా పూర్తి చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు.

వీటితో పాటు కొండపి నియోజకవర్గ ప్రజలకు కోట్లాది రూపాయల డబ్బును సంక్షేమ పథకాల రూపంలో నేరుగా అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారు.



పెరిదేపిలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సచివాలయం సేవలు భేష్



సీఎం జగన్ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు బాగున్నాయి. వలంటీర్లే ఇంటికి వచ్చి మరీ ఏ పథకానికి అర్హులమో చెప్పి సేవలు అందిస్తున్నారు. మా గ్రామంలో సైతం ప్రభుత్వం సుమారు రూ.50 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేసి బ్రహ్మాండంగా నూతన సచివాలయ భవనాన్ని నిర్మించింది.

– ఎస్.బాలకోటయ్య, కొండపి

జగనన్న చలవతో ఇల్లు నిర్మించుకున్నాం



గ్రామంలోనే జగనన్న కాలనీలో ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం జగనన్న ఇచ్చారు. అందులోనే ఇల్లు నిర్మించుకోవడానికి డబ్బు ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాను. ప్రస్తుతం ప్లాస్టరింగ్ పనులు చేయించుకుంటున్నా. త్వరలోనే ఇంట్లోకి చేరతా. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– జి.మరియమ్మ, పెదకండ్లగుంట

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



టీడీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

పామూరు: మండలంలోని చెంచిరెడ్డిపల్లి, నర్రమారెళ్ల ఎస్సీ కాలనీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏసురత్నం, నాయకులు గుంటుపల్లె చెంచురామయ్యల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన నేలటూరి సుందరయ్య, గంధం దానియేలు, జీవయ్య, పెద్దయ్య, సాల్మాను, ప్రభుదాసు, దేవయ్యలతో పాటు పలువురికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. ప్రతిపేద సొంతింటి కలను సాకారం చేసుకోవడంతో పాటు ఆర్థికంగా ఎదిగి ఉన్నతస్థితికి చేరుకోవాలనేదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, గుంటుపల్లె సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, సర్పంచ్ మెడబలిమి గురవయ్య, గుంటుపల్లి చెంచురామయ్య, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఈదగ్గుల వెంకటేశ్వరరెడ్డి, పావులూరి ఆదినారాయణ, ఎంపీటీసీ రెక్కల అనితారెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, చప్పిడి అజయ్, గోవిందయ్య, బ్రహ్మయ్య, శ్రీరాం శ్రీను, పాలేటి ప్రేం నాయకులు పాల్గొన్నారు.

సొంతూరులోనే నీళ్లివ్వడం లేదు.. నియోజకవర్గానికి ఏం చేస్తాడు?



తూర్పునాయుడుపాలెంలో కాఫీ విత్ గృహసారథిలో వరికూటి

- ఎమ్మెల్యే డోలా తీరుపై తూర్పునాయుడుపాలెం వాసుల ఆగ్రహం
- కాఫీ విత్ గృహసారథిలో అశోక్‌బాబుకు సమస్యల నివేదన

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఆదివారం వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహసారథి మీసాల శ్రీను నివాసాన్ని వరికూటి సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. తమ క్లస్టర్ల పరిధిలోని ప్రజలకు వలంటీర్ల సహాయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎస్టీ కాలనీలో ప్రధానంగా రోడ్లు, సైడు కాలువలు లేనందున వర్షం నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలో గుక్కెడు మంచి నీటి కోసం వెంపర్లాడాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే ఇంటికి, గ్రామానికి కిలో మీటరు దూరంలో ఉన్న దామచర్ల సత్య కంపెనీకి 110 ఎంఎం పైపులు వేసుకుని, గ్రామస్తులకు మాత్రం 25 ఎంఎం పైపులు వేశారని, దీంతో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని వివరించారు. దీనిపై వరికూటి స్పందిస్తూ.. తొమ్మిదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటున్న డోలా, అలాగే టీడీపీ సానుభూతిపరుడైన సర్పంచి కలిసి గత ఎనిమిది నెలలుగా ప్రజలకు మంచి నీరు సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్యను ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టినట్లుందన్నారు. పంచాయతీ వారికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. నిత్యం అభివృద్ధి అని మాట్లాడే ఎమ్మెల్యే స్వామి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత గ్రామంలోనే మౌలిక వసతులు కల్పించలేని స్వామి నియోజకవర్గ ప్రజలకు ఏమి చేస్తాడని తూర్పునాయుడుపాలెం వాసులు ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా.. కాలనీలో నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లతో సరఫరా చేయాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దామచర్ల అనీల్, దామచర్ల బుజ్జికి సూచించారు. కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు, దినేష్, హరినారాయణ, నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి



పోతురాజు మృతదేహం

పులివెందుల: పట్టణంలోని రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవలపాడు గ్రామానికి చెందిన పోతురాజు(38) పులివెందులకు కొన్ని నెలల క్రితం వచ్చి బేల్దారీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మరి కొంత మందితో కలిసి సరదాగా రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో ఈత కోసం వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఆయన ఈత కొడుతూ నీటిలో కనిపించకుండా గల్లంతయ్యాడు. దీంతో అక్కడి వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీం నీటి కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. నీటిలో మునిగి చనిపోయిన పోతురాజును బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోతురాజుకు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జ్యోతిరావు పూలే పార్కు ఆవరణలో ముదిరాజ్ సంఘ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందిళ్లపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఆకుమల కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు పందిళ్లపల్లె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నక్కనబోయిన ప్రభుదాస్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



చింతలపాలెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ కొండి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు

జరుగుమల్లి(సింగరాయకొండ): పేదలకు సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపడటంతోపాటు అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించేందుకే గడప గడపకూ వస్తున్నామన్నారు. జరుగుమల్లి మండలంలోని చింతలపాలెం గ్రామంలో రెండో రోజు ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను 90 శాతానికి పైగా ప్రజలకు చేరువయ్యాయన్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు పొందలేకపోయిన వారిని గుర్తించి వారికి కూడా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించడంతోపాటు పథకాలు వర్తింపజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 1.02 లక్షల గృహాలు ఉండగా దాదాపు అన్ని గడపలు తిరిగానని, నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నానని చెప్పారు. కానీ ఎమ్మెల్యే స్వామి జనాన్ని గాలికొదిలేశారని, గత ప్రభుత్వంలో పేదల మరుగుదొడ్ల నిధులు సైతం దిగమింగాడని ఆరోపించారు. గ్రామ వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడుకు ప్రజలే సరైన గుణపాఠం చెబుతారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను ఇవ్వడం, నిరుపేదలు సంక్షేమ పథకాలు పొందేలా చేదోడుగా నిలవడం, అనారోగ్యంతో బాధపడుతూ దూరప్రాంతాల్లో చికిత్స పొందుతున్నా అక్కడికి సైతం వెళ్లి వలంటీర్లు పింఛను ఇస్తున్నారని, అటువంటి వారిపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర మహిళా అధ్యక్షురాలు పల్లా అనూరాధ, సర్పంచ్ వేల్పుల హరిబాబు, బెల్లం బాబీ, బెల్లం సుబ్బారావు, బద్దిపూడి సురేష్, బద్రీ, నల్లూరి సురేంద్ర, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పామూరు: మండలంలోని బోడవాడ సచివాలయ పరిధిలోని అక్కంపేట, బోడవాడ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతుందని ఎంపీడీఓ వి.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

రామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



రామిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

వెలిగండ్ల: కీసరి రామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని పి.నాగులవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కీసరి రామిరెడ్డి శనివారం గుండెపోటుతో చనిపోయారు. టీటీడీ పాలకమండలి సభ్యులు, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, ఎంపీడీఓ టి.సుకుమార్, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వై నాగూర్‌యాదవ్, దమ్ము చెన్నకేశవులు, కె వెంకట్రామయ్య, టి. దేవసహాయం, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, బొబ్బా వెంకటరెడ్డి, మేడం ఆదిరెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఆదివారం కీసరి రామిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.